తాటితూరు మార్గం.. ప్రమాదకరం

- అసలే మెలికలు.. ఆపై శిథిలం
- తూముల వద్ద కానరాని రక్షణ గోడలు
- ఆధునికీకరణకు వినతి



మహరాజుపేట-పద్మనాభం సీసీ రోడ్డుకు అనుసంధానంగా శిథిలమైన తాటితూరు బీటీరోడ్డు



తాటితూరు రహదారిలో ప్రమాదకరమైన తూము



వ్యవసాయ భూముల మధ్య వంపు తిరిగిన మహరాజుపేట-తాటితూరు రహదారి

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ నుంచి మహరాజుపేట-పద్మనాభం రహదారిలోని ఆంజనేయస్వామి ఆలయ కూడలి వరకు రహదారి ప్రమాదకరంగా ఉంది. 3.6 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిని ఆధునికీకరించి, పంచాయతీకి సిటీ సర్వీస్‌ను పునరుద్ధరించాలని మండలవాసులు కోరుతున్నారు.

తాటితూరు కూడలి నుంచి పంచాయతీ వరకు వ్యవసాయ భూముల మధ్య మెలికలు తిరుగుతూ ఉన్న సన్నటి రహదారి పలుచోట్ల శిథిలమైంది. ఈ రోడ్డు మధ్య పలుచోట్ల రాతికట్టుతో ఉన్న తూములు శిథిలమై రక్షణగా రెయిలింగ్ కూడా లేకుండా బోసిగా ఉన్నాయి.

ఇటుకబట్టీలతో ధూళి

రోడ్డు పొడవునా ఇరువైపులా ఇటుకబట్టీల కారణంగా మట్టి కొట్టుకుపోతున్నాయి. రహదారి మీదుగా రాకపోకలు సాగించేవారితో పాటు పచ్చని పంట భూములపై ధూళి పేరుకుపోతోంది. బట్టీల కాలుష్యం కారణంగా ఇరువైపులా పచ్చటిచెట్లు మాడిపోతున్నాయి. 15 ఏళ్ల క్రితం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి 222 టీ సిటీ సర్వీస్ తాటితూరుకు ఉదయం, సాయంత్రం నడిచేది. నైట్‌హాల్ట్ కూడా తాటితూరులోనే ఉండేది. రహదారి శిథిలం కావడంతో పాటు ఆటో సర్వీసులు పెరిగిపోవడంతో బస్సును నిలిపివేశారు.

తాటితూరు చుట్టూ శిథిల రహదారులే..

తాటితూరు పంచాయతీకి మహరాజుపేట కూడలి నుంచి, టి.నగరపాలెం మీదుగా, తగరపువలస ఎల్లారమ్మ కొండ వెనుక గోస్తనీనది పక్క నుంచి, పాండ్రంగి-సంగివలస మీదుగా చేరుకోవచ్చు. ఇంకా తాటితూరు నుంచి మజ్జివలస, లక్ష్మిపురం, శింగనబంద పంచాయతీలకు రహదారులు ఉన్నా అన్నీ శిథిలం కావడమో లేదా మట్టి రోడ్డులే కావడంతో పక్కాగా అన్ని వసతులతో రహదారిని నిర్మించాలని కోరుతున్నారు.

కుంగిన కాజ్‌వే

సంగివలస-పాండ్రంగి రహదారిలో కూడా ఉమారామలింగేశ్వర ఆలయం వద్ద కాజ్‌వేపై కుంగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మిగిలిన పంచాయతీలకు కనెక్ట్ చేసే రహదారులు బాగానే ఉన్నా ఒక్క తాటితూరు పంచాయతీకే ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. తాటితూరు-మహరాజుపేట రహదారిపై తూములపై ఇటుకలతో కూడిన రక్షణగోడలు కూలిపోయి బయటకు కనిపిస్తున్నాయి. తాటితూరు కూడలి వద్ద పంచాయతీకి చెందిన బీటీరోడ్డు, ఆర్ అండ్ బీకి చెందిన సీసీరోడ్డుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎత్తుపల్లాలతో కూడి ఉంది. అలాగే పంచాయతీలో బీసీ కాలనీ, హైస్కూల్ రహదారులను కూడా ఆధునికీకరించాలి. గతంలో పంచాయతీకి నడచిన సిటీ సర్వీస్‌ను పునరుద్ధరిస్తే విద్యార్థులు, కూలీలు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగస్తులకు సౌకర్యంగా ఉంటుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తాం



రహదారికి ఇరువైపులా మూడేసి అడుగులు విస్తరించి మట్టి, గ్రావెల్‌తో పటిష్టం చేయాలి. తూముల వద్ద రెండు వాహనాలు తప్పుకొనే అవకాశం లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని పునర్నిర్మించవలసి ఉంది. బీసీ కాలనీ, హైస్కూల్ రోడ్లు నిర్మించాలి. వీటితో పాటు సిటీబస్సు కోసం సహకరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళతాం.

– శిరిగుడి సంతోషి, సర్పంచ్, తాటితూరు

అధ్వానంగా అనుసంధాన రహదారి



పెద్ద గోతులతో ఉన్న రోడ్డు

ఆనందపురం : మండలంలోని వేములవలస, వెల్లంకి గ్రామాలను అనుసంధానిస్తూ నిర్మించిన రోడ్డు శిథిల స్థితికి చేరుకుంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణానికి అవస్థలు పడుతున్నారు. గతంలో వేములవలస నుంచి వెల్లంకి చేరుకోవడానికి జాతీయ రహదారి గుండా ప్రయాణించవలసి రావడంతో ప్రమాదాలకు ఆస్కారం ఉండేది. దీంతో వెల్లంకి స్టేట్ బ్యాంక్ రోడ్డు నుంచి వెల్లంకి వరకు గల పొలాల మధ్య నుంచి రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ఈ మార్గం వెల్లంకితో పాటు భీమిలి ప్రాంతానికి వెళ్లేవారికి దగ్గర దారిగా మారింది.

శిథిలం.. గోతులమయం

ప్రస్తుతం ఆ రోడ్డు పూర్తిగా శిథిలమై గోతులమయంగా మారింది. చినుకు పడితే చాలు గోతుల్లో నీరు చేరుతోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో బిక్కుబిక్కుంటూ ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

31న గీతం అంతర్జాతీయ విద్యార్థుల ఉత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డా. కె.పి. కిషన్

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 31వ తేదీన అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని అంతర్జాతీయ విద్యార్థి విభాగం డైరెక్టర్ డా. కె.పి. కిషన్ తెలిపారు. వర్సిటీలో వివిధ కోర్సులను అభ్యసిస్తున్న పలు దేశాలకు చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో సంయుక్త-23 పేరిట ఈ వేడుక ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమ పోస్టర్‌ను గీతం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టంతో కలసి గురువారం ఆవిష్కరించారు.

వారిజ ఆశ్రమంలో సుందరకాండ పారాయణం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట వారిజ ఆశ్రమంలోని శ్రీ లక్ష్మీ హయగ్రీవ మందిరంలో సుందరకాండ పారాయణం కొనసాగుతోంది. వసంత నవరాత్రుల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆనందపురం ఇన్‌చార్జి ఎంఈవోగా బాలామణి



ఆనందపురం : ఆనందపురం మండలం ఇన్‌చార్జి ఎంఈవోగా కె.అమృత బాలామణి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఈవో పద్మావతి ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో సస్పెండ్ కావడంతో, భీమిలి ఎంఈవో అమృత బాలామణిని ఇన్‌చార్జిగా నియమించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వర్మ తదితరులు ఆమెను కలిసి, పలు అంశాలను చర్చించారు.

ఆరో వార్డులో జెడ్సీ పర్యటన



కొమ్మాదిలో పర్యటిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జోన్-2 జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి సూచించారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది ప్రాంతంలో గురువారం ఆమె పర్యటించారు. డ్రైనేజీల్లో మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. ఈ ప్రాంతంలో ఉన్న డ్రైనేజీలను పరిశీలించారు. ఈ ప్రాంతాలన్నీ శుభ్రపరచాలని శానిటేషన్ అధికారులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

బురదమయంగా సిమెంట్ రోడ్డు



రోడ్డు మధ్యలో బురద

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ బర్లపేటలో సిమెంట్ రోడ్డు మధ్యలో శిథిలమైంది. దీంతో ఈ ప్రాంతం మట్టి రోడ్డుగా మారింది. వర్షాలు కురుస్తే ఇక్కడ రోడ్డు బురదగా తయారవుతోంది. మూడు రోజులుగా వర్షాలు కురవడంతో మరింత అధ్వానంగా తయారైంది. దీంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాంకింగ్-సాంకేతిక అంశాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న క్విజ్ మాస్టర్ విఖ్యాత్ ముత్యాలు

పీఎం పాలెం: బ్యాంకింగ్-సాంకేతిక అంశాలపై అందరికీ అవగాహన అవసరమని క్విజ్ మాస్టర్ విఖ్యాత్ ముత్యాలు అన్నారు. బ్యాంకింగ్, సాంకేతిక అభివృద్ధి అనే అంశంపై స్థానిక సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీ-20 ప్రెసిడెన్సీ థీమ్ ప్రాముఖ్యతను ప్రచారం చేయాలన్న లక్ష్యంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం నగరంలోని సాంకేతిక విద్యాపరిషత్‌కు చెందిన విద్యార్థులతో క్విజ్ పోటీలు నిర్వహించిందన్నారు. సుమారు 150 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభకనబరిచారు. నాలుగు రౌండ్లుగా జరిగిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆఖరి రౌండ్‌కు చేరిన విద్యార్థులకు కాన్సొలేషన్ బహుమతులు అందించారు.

మార్కెట్‌లోకి సరికొత్త హ్యుందాయ్ వెర్నా



స్థానిక మ్యాంగో హ్యుందాయ్ షోరూంలో లాంచ్ చేసిన సరికొత్త హ్యుందాయ్ వెర్నా కారు

పీఎం పాలెం: మధురవాడలోని మ్యాంగో హ్యుందాయ్ షోరూంలో సరికొత్త హ్యుందాయ్ వెర్నా కారును గురువారం ఆవిష్కరించారు. సంస్థ చైర్మన్ గోలి రామకృష్ణ మాట్లాడుతూ హ్యుందాయ్ వెర్నాకారు ప్రారంభ ధర రూ.10.89 లక్షల నుంచి రూ.17.3 లక్షల వరకూ ఉంటుందన్నారు. పెట్రోల్, టర్బో వేరియంట్లలో లభించే ఈ కారు లీటర్ పెట్రోలుకు 18.6 కిలోమీటర్లు, టర్బో 20.6 కిలోమీటర్లు మైలేజీ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గోలి వెంకట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ మాధవ్, సేల్స్ హెడ్ కుమార రాజా పాల్గొన్నారు.

ఈదురుగాలులకు అరటి తోటల ధ్వంసం



కుసులువాడలో నేలకొరిగిన అరటి తోట

ఆనందపురం: మండలంలో బుధవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు పలు గ్రామాలలో అరటి తోటలు ధ్వంసమయ్యాయి. సుమారు 15 ఎకరాలలో పంట దెబ్బతింది. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. పక్వానికి వచ్చిన అరటి గెలలతో సహ గాలులకు నేలకొరిగాయి. బోయిపాలెం, గంభీరం, తర్లువాడ, కుసులువాడ తదితర గ్రామాలలో అరటి తోటలు దెబ్బతిన్నాయి. కుసులువాడలో కోరాడ జగన్ అనే రైతు రెండెకరాలలో అరటి తోట వేశాడు. పక్వానికి వచ్చి గెలలతో ఉన్న తోట ఈదురు గాలులకు నేల కొరగడంతో లక్షల్లో నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన పంట నేల పాలు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా స్వర్ణపుష్పార్చన



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న ఉప ప్రధానార్చకుడు, ఉద్యోగులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళిని నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈసేవను నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు శ్రీ వరాహ నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమంపడంలోని వేదికపై వేంజేంప జేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు ,ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజను నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ ఈపూజలో పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న గిరిజన పూజారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ని గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా లోని పలువురు గిరిజన పూజారులు దర్శించుకున్నారు. ఆ జిల్లాలోని పలు గ్రామా ల్లో విశ్వ హిందూ పరిషత్ ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి ఆలయాల్లో వీరంతా పూజారులుగా ఉన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని టీటీడీ నిర్మిస్తున్న 163 ఆలయాల్లో కూడా వీరంతా పూజారులుగా విధులు నిర్వహించనున్నారు. ఈ తరుణంలోనే గురువారం భీమిలిలో జరిగిన ఒక సమావేశానికి వచ్చిన వీరంతా తొలుత సింహాచలంలో స్వామివారిని దర్శించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అల్లూరి జిల్లాలోని ఆలయా ల నిర్మాణాల పర్యవేక్షకుడు రాంబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విప్లవ వీరులకు ఘన నివాళులు



భగత్‌సింగ్ చిత్రపటంతో తగరపువలసలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డైట్ అధ్యాపకులు



మధురవాడలో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తగరపువలస: స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటిష్ వారిచే కిరాతకంగా ఉరి తీయబడిన విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు గురువారం నివాళులు అర్పించారు. వారి వర్ధంతి సందర్భంగా చిట్టివలస జీఆర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటంతో తగరపువలస, చిట్టివలస పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కరు కూడలిలో జరిగిన కార్యక్రమంలో పైడిరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్‌ను పొట్టన పెట్టుకున్న బ్రిటీష్ అధికారిని హతమార్చిన ముగ్గురు విప్లవవీరులు వీరమరణం పొందారన్నారు. ఇన్నేళ్లయినా వీరి త్యాగాలను భారతీయులు మరచిపోలేదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, తూతిక సోమరాజు, చిల్ల రాంపైడి, మనుగిండ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

- చిట్టివలస సీఐటీయూ ఆఫీసులో భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు వర్ధంతిని నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయస్సులోనే భగత్ సింగ్ ప్రాణాలర్పించారన్నారు. సీఐటీయూ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, డి.బాబాజీ, డీవైఎఫ్ఐ నాయకుడు శ్రీనివాస్ వర్మ పాల్గొన్నారు.

మధురవాడ: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని మధురవాడలోని సీపీఐ కార్యాలయంలో, వారి చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ వారి త్యాగ నిరతి నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ మధురవాడ ఏరియా సమితి కార్యదర్శి వి. సత్యనారాయణ, ఎండాడ క్వారీ సెక్రటరీ వాండ్రాసి రవికుమార్, సీపీఐ నాయకులు జి. వేలంగిణిరావు, కె. కాంతమ్మ, ఎస్. అప్పారావు రెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ త్యాగం మరువలేనిది

భీమునిపట్నం: దేశ స్వాతంత్ర్య సమరంలో తన వంతు పోరాటం చేసి ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ త్యాగం మరువలేనిదని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ యూ.మాణిక్యంనాయుడు అన్నారు. డైట్ కళాశాలలో గురువారం నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిటిష్ వారిపై భగత్‌సింగ్ చేసిన తిరుగుబాటు పోరాటం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



నామినీ రమణమ్మకు బీమా సొమ్ము అందిస్తున్న రామునాయుడు

తగరపువలస: మృతుడి కుటుంబానికి బీమా సొమ్మును గురువారం అందించారు. స్థానిక పీఏసీఎస్‌లో సభ్యుడైన భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీకి చెందిన చిల్ల సుత్తినాయుడు ఇటీవల మృతి చెందడంతో, బీమా సొమ్ము రూ.15వేలను అతని భార్య రమణమ్మకు సంఘం అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు అందజేశారు. సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్లు చేట్ల ఎల్లయ్యరెడ్డి, రవ్వ పద్మావతి, సంఘం సీఈవో చిక్కాల ఉమా మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో



ప్రమాదంలో నుజ్జయిన ఆటో

తగరపువలస: జాతీయ రహదారిపై బుధవారం రాత్రి వలందపేట వద్ద ఆగి ఉన్న లారీని ఓ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాకుళం జిల్లా పాత కురిమినాయుడపేటకు చెందిన ఆటో డ్రైవర్ నిమ్మ అప్పలనాయుడు(33)కు గాయాలయ్యాయి. ఒడిశా రాష్ట్రం సిమ్లగూడకు చెందిన లారీ బ్రేక్ డౌన్ కారణంగా రోడ్డు పక్క నిలిపేశారు. ఈ లారీని విశాఖ నుంచి శ్రీకాకుళం వెళుతున్న ఆటో ఢీకొట్టగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆటో నుజ్జు అయింది. ఈ ప్రమాదం జరిగిన తరవాత వెనక నుంచి కారులో వస్తున్న ఇద్దరు శ్రీకాకుళం వాసులు వీటిని తప్పించబోయి అవతలి రోడ్డులో బస్‌ను ఢీకొట్టి మృత్యువాత పడ్డారు.

జీవీఎంసీ జోన్-2 అధికారుల ఫోన్ నంబర్లు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్-2 పరిధిలోని వివిధ విభాగాలు అధికారులను ఫిర్యాదులు, సేవల్లో ఇబ్బందులు ఎదురైతే సంప్రదించవచ్చు. వారి ఫోన్ నంబర్లు మీ కోసం..

అధికారి	హోదా	ఫోన్ నంబర్
కె.కనకమహాలక్ష్మి	జోనల్ కమిషనర్	98483 66878
ఎ.అప్పలరాజు	సూపరింటెండెంట్	99482 96999
టౌన్ ప్లానింగ్ విభాగం		
సీహెచ్.రఘునాథరావు	ఇన్‌చార్జ్ ఏసీపీ	78930 07336
హేమంత్ కుమార్	బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్	9912349480
పారిశుధ్యం విభాగం		
ఎస్.కిషోర్	వైద్యాధికారి	95026 61063
మంగరాజు	బీడీఆర్	99488 83906
ఎన్.శ్రీనివాసరాజు	శానిటరీ సూపర్‌వైజర్	99488 83930
కాకర శ్రీను	ఎస్ఐ, 5వ వార్డు	99488 83936
సీతారామ్	ఎస్ఐ, 6వ వార్డు	99488 83935
సంతోష్‌కుమార్	ఎస్ఐ, 7వ వార్డు	99488 83940
రెవెన్యూ విభాగం		
పి.రమేష్	రెవెన్యూ అధికారి	99853 73797
బి.రమేష్	ఆర్ఐ	98665 08143
బి.ప్రదీప్	ఆర్ఐ	95533 33647
ముగడ రాజు	ఆర్ఐ	98664 44408
ఇంజినీరింగ్ వర్క్స్		
ఎస్.మత్స్యరాజు	ఈఈ	99485 25297
ఆర్.వంశీకృష్ణ	డీఈ	99123 49450
ఎం.వెంకటరావు,	ఏఈ 5 - 9 వార్డులు	74167 62597
వై.అప్పాజీ	ఏఈ 10-13 వార్డులు	87127 08493
వాటర్ సప్లై		
కె.ఎల్.సుధాకర్	ఈఈ	99515 32875
డి.శ్రీహరి	డీఈ	99485 25293
విద్యుత్ శాఖ		
డి.శ్రీధర్,	ఈఈ	99123 49441
సీహెచ్.స్రవంతి	ఏఈ	77299 95940
యూసీడీ విభాగం		
ఎన్.గంగాధర్	ఏపీడీ	77299 95947

నూకాలమ్మ ఉత్సవ ఆదాయం రూ.11.32 లక్షలు

భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత నూకాలమ్మవారి ఉత్సవం ద్వారా దేవదాయ శాఖకు రూ.11,32,287 ఆదాయం లభించింది. గురువారం ఆలయం వద్ద ఈవో కీర్తి శ్రీనివాసరావు పర్యవేక్షణలో హుండీల్లోని నగదు లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం ఆదాయంలో హుండీల ద్వారా రూ 5,46,927 రాగా, టికెట్‌ల ద్వారా రూ 5,85,360 వచ్చిదని తెలిపారు. గతేడాది కన్నా రూ.లక్ష ఆదాయం తగ్గిందని, అప్పుడు ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించామని, ఈసారి రెండు రోజులు మాత్రమే జరిగాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీరావు(రంగా), ప్రధాన కార్యదర్శి రాంభుక్త ప్రభాకరనాయుడు, కోశాధికారి కాసరపు ఎల్లాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి నమ్మి శేషాద్రియాదవ్, కోఆర్డినేటర్ ముమ్మిడిశెట్టి సునీల్, పెద్దలు మైలిపల్లి షణ్ముఖరావు, గంటా నూకరాజు, అల్లిపిల్లి నర్సింగరావు, కదిరి ఎల్లాజీ, కదిరి జగన్నాథం, కొక్కిరి అప్పన్న, కాసరపు నాగరాజు పాల్గొన్నారు.

